# సరదా కథలు

## మునిగిపోయిన ఫ్రెండ్‌షిప్

రఘుపతి ఎయిర్ పోర్ట్ లో దిగుతూనే షాక్ తిన్నాడు. కారణం — రాజారాం, రాఘవ తనని రిసీవ్ చేసుకోడానికి రాకపోవటం. అసలు తను ఈ దేశంలో అడుగు పెట్టగానే ఎగిరి గంతేసి స్వాగతం పలుకుతారనుకున్నాడు. నిజంగా ఇది తను ఊహించని పరిణామం.

నాలుగు అడుగుల వెయ్యగానే ఎదురుపడ్డాడు రాజారాం కారుడ్రైవరు. "ఎయిర్ పోర్ట్‌కి వస్తుంటే అయ్యగారి కాలు బెణికిందండి. నడవలేక పోయారు. మిమ్మల్ని దగ్గరుండి మరీ తీసుకురమ్మన్నారు" అన్నాడు. మనసు కొంచెం ఊరట చెందింది రఘుపతికి — "సరే... లగేజి తీసుకురా..." అంటూ కూపన్ అతడి చేతికిచ్చి బుక్‌స్టాల్ వైపు నడిచాడు.

"ఎయిర్ పోర్ట్‌కి వస్తుంటే అయ్యగారి కాలు బెణికిందండి. నడవలేక పోయారు. మిమ్మల్ని దగ్గరుండి మరీ తీసుకురమ్మన్నారు" అంటూ అక్కడ ఎదురుపడ్డాడు రాఘవకారు డ్రైవరు. చాలాసేపట్నుంచి వెతుకుతున్నట్టు ఉన్నాడు. అతని ముఖం ఆందోళనగా ఉంది.

రఘుపతికి నవ్వొచ్చింది. వస్తారనుకొన్న ప్రాణ మిత్రులిద్దరూ రాకపోవడం, డ్రైవర్లని పంపడం, రాలేకపోవడానికి చెప్పిన కారణం ఒకటే అవటం.


"వింతగా ఉందే!" అనుకున్నాడు. "అమెరికా నుంచి వస్తున్నాను కదా... అంచేత అమెరికన్ లెవెల్లో ప్రాక్టికల్ జోక్ ఆ ఇద్దరూ తన మీద వేస్తున్నారా!?" అని సందేహించాడు ఓక్షణం పాటు.

'రైట్... మనం కూడా తమాషాగా ఎటాక్ ఇద్దాం' అని అనుకుని "చూడు నీ పేరేంటి? అడిగాడు రాఘవ కారు డ్రైవర్ ని.

"రహీమ్".

"చూడు రహీమ్! నేనూ మీ అయ్యగారి కోసమే చూస్తున్నాను. ఈలోగా మా అత్త వారింటి నుంచి కారు వచ్చింది. వెళ్ళకపోతే బావుండదు కదా... అంచేత నువ్వెళ్ళిపో... నా సామాన్లు పడేసి ఓ అరగంటలో మీ అయ్యగారి దగ్గిరికి వస్తానని చెప్పు. మరోలా అనుకోవద్దన్నానని చెప్పు ఏం?" అని చెప్పాడు. ఎంతో నమ్మకంగా అలాగేనని చెప్పి వెళ్ళిపోయాడు రహీమ్.

రఘుపతి మనసులో కోరుకుంటున్నట్టుగానే రహీమ్ వెళ్ళిన ఓ రెండు నిముషాల తర్వాత లగేజి తీసుకొని వచ్చాడు రాజారాం కారు డ్రైవరు. అతగాడికి చెప్పినట్టే ఇతగాడికీ చెప్పాడు. మొదట చెప్పింది తిరిగి రెండోసారి యథావిధిగా చెప్పడంతో అనుకోకుండానే రిహార్సల్ అయి కంఠంలో అద్భుతమైన మాడ్యులేషన్ జతపడి ఎంతో ఎఫెక్టివ్‌గా వచ్చింది. దాంతో నమ్మక తప్పింది కాదు రాఘవ కారు డ్రైవరుకి. సరేనని




తలాడించి వెళ్ళిపోయాడతను.

ఆ తర్వాత ఓ ప్రైవేట్ టాక్సీ మాట్లాడుకొని ఇంటికి చేరుకొన్నాడు రఘుపతి.

ఇంటికి రాగానే తండ్రిని అడిగిన మొదటి ప్రశ్న — "రాఘవ, రాజారాం ఎలా ఉన్నారు?"

"ఇచ్చితంగా నేనూహించినట్టే నువ్వు రాగానే ఇదే అడుగుతావనుకున్నాను. నిజం చెప్పాలంటే ఇద్దరి మధ్య సయోధ్య ఉన్నట్టు కనిపించటం లేదు. దెబ్బలాడుకున్నట్టు ఏ దాఖలాలూ లేవుగాని ఇద్దరూ ఇక్కడికి విడివిడిగా వస్తారు. ఒకరి ప్రసక్తి వచ్చినపుడు మరొకరు మౌనం వహిస్తారు. చూడగా చూడగా మీ ముగ్గురు ప్రాణస్నేహితుల్లో నీక్కూడా తెలీని విధంగా వాళ్ళిద్దరి మధ్య అభిప్రాయం బేధం వచ్చిందంటే ఎక్కడో తగలకూడని చోటే తగిలి ఉంటుంది దెబ్బ. ఎవరు కొట్టేరో ఎవరు తిన్నారో తేల్చాల్సింది నువ్వేమరి" అన్నాడాయన కొడుకుని ఓ పక్కకి తీసుకెళ్ళి.

అంతే! అయిదు నిముషాలు కూడా ఉండలేదు రఘుపతి తన ఇంట్లో...! ఆటో మాటాడుకుని రాఘవ ఇంటికి చేరుకున్నాడు.

రాఘవ ఆయుర్వేద డాక్టర్ల వంశంలో పుట్టాడు. తరతరాలుగా వస్తున్న ఆయుర్వేద వైద్యం కొనసాగిస్తూనే ఈ పరీక్షలూ, ఆపరీక్షలూ రాసి రిజిష్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ సర్టిఫికెట్ సంపాదించాడు. అడపాదడపా చిన్న చిన్న ఆపరేషన్లు కూడా విజయవంతంగా చేసి మంచి హస్తవాసి ఉన్న డాక్టరుగా పేరు తెచ్చుకున్నాడు.

రఘుపతిని చూడగానే ఎగిరి గంతేసి కావలించుకున్నాడు రాఘవ. పరుగెత్తినంత వేగంగా తన రూమ్‌లోకి తీసుకువెళ్ళి తలుపులు వేసేసి బావురుమన్నాడు పసిపిల్లాడిలా.

"నేను అనుకుంటూనే ఉన్నాను. ఏదో ఎక్కడో బెడిసిందని.. అందుకేనా ఎయిర్ పోర్ట్‌క్కూడ రాలేదు?" అడిగాడు రఘుపపతి.

"ఊ"

"ఇప్పుడ చెప్పు? ఏం జరిగింది?"

"ఏం చెప్పను... ఎలా చెప్పను.. అసలు ఏం జరిగిందో నాకేం తెలుసు? ఓ మూణ్ణెల్ల క్రితం వాడో చిన్న ఆపరేషన్ చేయించుకున్నాడు. నేనే చేసేస్తాన్నాను. ఏమనుకున్నాడో "ఏవిటో వద్దులే ప్రైవేట్ నర్సింగ్‌హోంలో చేయించుకుంటా"నన్నాడు. సర్లే వాణ్ణి బలవంతం

చెయ్యడం ఎందుకని సరేనన్నాను. ఆపరేషన్ దగ్గర వుండి జరిపించాను కూడా. డిశ్చార్జ్ అయిన మర్నాడు ఎలా ఉన్నాడో చూద్దాం అని వెళ్ళాను. తలుపులువేసేసి 'ఇంక నీ ముఖం నాకు ఈ జన్మలో చూపించకు. మళ్ళీ కనిపించావో నరికేస్తాను' అన్నాడు. జోక్ వేస్తున్నాడనుకున్నాను. తన్నబోయేడు. కాళ్ళావేళ్ళా పడ్డాను కారణం చెప్పమని. చెప్పనుగాక చెప్పను. ఆలోచించు నీకే తెలుస్తుంది అన్నాడు. ఎంత ఆలోచించినా అర్థం కాలేదు. అక్కణ్ణుంచి కదలకపోతే నౌఖర్లతో మెడపెట్టి గెంటిస్తానన్నాడు. పదిమంది మధ్య పరువు పోవడం ఇష్టం లేక వచ్చేశాను. ఆరోజు నుంచి ఈ రోజు వరకు మొత్తం అన్ని సంబంధాలూ కట్. ఎంత గింజుకున్నా నాకు అర్థంకావటంలేదు. వాడెందుకలా ప్రవర్తించాడో..! నీతో తప్ప ఇంకెవరితోనుచెప్పుకోలేను. ఎందుకంటే మన ముగ్గురం ఒకటి అనే కదా ఊళ్ళో మనకి పేరు. అంచేత నువ్వే పూనుకోవాలి... ప్లీజ్'' అని ప్రాధేయపడ్డాడు రాఘవ.

సరేవాడేం చెప్తాడో చూస్తానని రాజారాం ఇంటికి బయల్దేరాడు రఘుపతి.

''నాకు తెలుసు... నువ్వీ ప్రశ్న అడుగుతావని, నేను సమాధానం చెప్పాలి అని! పూర్తిగా విన్న తర్వాత నువ్వే చెప్పు నా నిర్ణయం సరియైనదో కాదో'' అంటూ మొదలుపెట్టాడు రాజారాం.

''మూణ్ణెల్ల క్రితం నేను ఫామిలీప్లానింగ్ ఆపరేషన్ చేయించుకున్నాను. నీకు తెలుసుగా... ఈ గవర్నమెంటు ఆస్పత్రులు, వాళ్ళ డబ్బులు ఆవ్యవహారం అదీ నాకు నచ్చదని... అయినా మనకేం లోటు అని ప్రైవేట్ నర్సింగ్‌హోమ్ లోనే చేయించుకున్నాను. వీడు... ఈ రాఘవగాడు ఎందుకు లేరా నేను చేసేస్తానన్నాడు. నాక్కూడ వీడిచేత చేయించుకొందాం అనిపించింది — ఎంతైనా ప్రాణమిత్రుడు కదా ఇచ్ఛితంగా పరాయి డాక్టర్ కన్నా జాగ్రత్తగా చూసుకుంటాడన్న నమ్మకంతో. అయినా మా ఆవిడ ఒప్పుకోలేదు. 'వద్దండీ... నా మీద మీకు ఏ మాత్రం అభిమానం ఉన్నా వేరే డాక్టర్‌తోనే చేయించుకోండి' అని పట్టుపట్టింది.

సర్లే అని వాడికి ఎలాగోలా నచ్చచెప్పి ప్రైవేట్ నర్సింగ్‌హోమ్ లో చేయించుకున్నాను. ఆపరేషన్ టైమ్‌లో తను ఫామిలీ డాక్టర్‌గా దగ్గరుండి తీరాలి అని మొండికేసుకొని కూచున్నాడు.

''ఫామిలీ ప్లానింగ్ ఆపరేషన్‌కి అంతగా పట్టుబడతారేటండీ?'' అని నవ్వేశారు ఆ ప్రైవేట్ నర్సింగ్‌హోం డాక్టర్లు.

అయినా వీడు వినలేదు. తను ఉండి తీరాలన్నాడు. 'సర్లే... మనం అంటే ప్రాణం పెడతాడు కదా' అని నేనే కల్పించుకొని 'ఉండనివ్వండి' అంటూ ఆ డాక్టర్లని రిక్వెస్ట్ చేశాను. ఆపరేషన్ టైమ్‌లో ఏమయిందో తెలుసా?''

''ఏమయింది?'' అడిగాడు రఘుపతి ఆత్రతగా.

''నాకు మత్తు ఇంజక్షను ఇచ్చారు కదా. ఏమీ తెలియదనుకున్నాడు కాబోలు అదృష్టవశాత్తు వాడు అన్న మాటలన్నీ వినిపించాయి''.

''ఏమన్నాడు?'' అన్నాడు రఘుపతి గుండె విపరీతమైన వేగంతో కొట్టుకుంటుండగా.

''డాక్టర్లు ఓ నెర్వ్‌కట్ చేశారు. నొప్పి తెలియకపోయినా నాకు స్పర్శ తెలుస్తూనే ఉంది. ఆ టైమ్‌లో వాడు అంటాడూ ''హమ్మా ఇదా కట్ చెయ్యాలి'' అని. ఇపుడు చెప్పు రఘుపతీ. ఆ వెధవని నమ్మి వాడి చేతే ఆపరేషన్ చేయించుకుంటే ఏవి కట్ చేసేవాడు? ఆ ఆపరేషన్ నేర్చుకోడానికి నేనే దొరికానన్నమాట. అందుకే వాడికి ముఖం చూపించవద్దాన్నాను''అని ముగించాడు రాజారాం.

●

మినీకథ

# ప్లాన్

తలలో మల్లెలతో తెల్ల చీరకట్టుకొని దేవకన్యలా తయారయింది సునీత. ఆమెను చూసి నిగ్రహం ఆపుకోలేక దగ్గరకు వచ్చాడు సుందరం. సునీతకు భర్త దగ్గరకు రావడం యిష్టం లేదు. అయినా తప్పని పరిస్థితిలో అతని పక్కన చేరింది.

ఇరువురూ బాహ్య ప్రపంచాన్ని మరువలేదు. ఎవరి ఆలోచనలో వాళ్ళుండగానే కార్యక్రమం ముగించారు.

ఎలా ఉంది? ఎప్పటిలాగే అడిగాడు సుందరం భార్యను.

నిర్లిప్తంగా 'ఎలాగున్నా ఫరవాలేదు లెండి' అనేసింది. ఎప్పుడూ ఫెంటాస్టిక్, స్వర్గం అనే పదాలు ఉపయోగించే భార్య అలా నీరసంగా మాట్లాడేసరికి చెప్పలేని నీరసం వచ్చేసింది సుందరంలో.

ఆ మర్నాడు అన్యమనస్కంగానే ఆఫీసుకి వెళ్ళాడు. సునీత రోజూ రంభలా తయారవుతూనే ఉంది. భర్త తమ సంగమం తరవాత ఎలా ఉంది అని అడుగుతుంటే అసలేమీ తృప్తిగా లేదు అని సమాధానం ఇస్తుంది సునీత.

సుందరంలో తన మగతనంపై అపనమ్మకం పట్టుకుంది. ఏ పనీ చేయ్యలేకపోతున్నాడు. భయంకరమైన క్రూరమృగాల మధ్య తానొక్కడే ఉన్నంతగా భయపడిపోతున్నాడు.

'ఎందుకు సడన్‌గా నా ఆరోగ్యం దెబ్బతింది? అని పదేపదే ఆలోచిస్తున్నాడు.

ఆఖరికి డాక్టర్‌ని కన్సల్టు చేసాడు. ఆయన ఏం లోపం లేదన్నారు. అయినా సుందరం తృప్తికోసం ఏవో మందులు వ్రాసి యిచ్చారు.

అయినా సునీత జవాబులో ఏ విధమైన మార్పులేదు. అసలు భర్తను ఇప్పుడు దగ్గరకు రానీయడం లేదు. ఎందుకని అడిగితే 'మీరు నన్ను ఎక్జయిట్ చేసి వదిలేస్తారు. ఆ తరువాత నా తిప్పలు నేను పడవలసి వస్తుంది' అని తెగేసి చెప్పేసింది.

ఇప్పుడు సుందరంలో కొత్త భయం చోటు చేసుకుంది. తాను యింట్లో లేనప్పుడు తన కోరికలు తీర్చుకోడానికి భార్య అడ్డదారులు తొక్కుతుందేమోనని.

ఆ ఊహరాగానే నెల, రెండు నెలలు మూడు నెలలు అలా శలవు పొడిగించేసాడు భార్యకు కాపలాగా.

సుందరం ఆఫీసుకు రాకపోవడంతో సుందరం గర్ల్ ఫ్రెండ్ అతని ఫ్రెండ్‌షిప్‌కి గుడ్‌బై కొట్టేసి అర్జంటుగా పెళ్ళిచేసేసుకుంది.

ఆ వార్త విన్న సునీత హమ్మయ్య! యింక నా భర్త చిన్నిల్లు సెటిల్ చేయలేదు అనుకొని యిప్పుడు యధావిధిగా భర్తకు సహకరించి, చాలా బావుంది అంటూ అతన్ని మునుపటిలాగే ముద్దులలో ముంచెత్తుతోంది. అతనూ ఆఫీసుకి శలవు పెట్టాల్సిన పరిస్థితే మరెప్పుడూ రాలేదు. గర్ల్ ఫ్రెండ్ దగ్గర మగసిరి తక్కువైతే తలెత్తకుండా తిరగలేనని సుందరం మరెప్పుడూ ఏ అమ్మాయి జోలికీ వెళ్ళలేదు.

—రాధిక